
క్లుప్తంగా

బాధ్యతలు తీసుకున్న ఎస్సైలు



వీర్నపల్లి: పోలీసు శాఖలో ఇటీవల జరిగిన ఎస్ఐ బదిలీలో వీర్నపల్లి నూతన ఎస్సైగా జిలెల్ల రమేశ్ నియామకమయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ నవత సిరిసిల్ల స్పెషల్ బ్రాంచికి బదిలీ కాగా.. రమేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్ చిత్ర లేఖన పోటీలను పర్యవేక్షించారు.

తంగళ్లపల్లి ఎస్సై..



తంగళ్లపల్లి: మండల నూతన ఎస్సైగా ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

చందుర్తి ఎస్సై..



చందుర్తి: చందుర్తి ఎస్సైగా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్సై అశోక్ బదిలీపై రుద్రంగి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా.. ఆయన స్థానంలో తంగళ్లపల్లి ఎస్సైగా పని చేస్తున్న వెంకటేశ్వర్లు చందుర్తి ఎస్సైగా బదిలీపై వచ్చారు.

ఎస్సైని కలిసిన నాయకులు

తంగళ్లపల్లి: మండలానికి ఎస్సైగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ప్రశాంత్‌రెడ్డిని తంగళ్లపల్లి కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సైని శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఎడమల భూపాల్‌రెడ్డి, కటకం రాజశేఖర్, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, మందాటి తిరుపతియాదవ్, కల్లెపెల్లి తిరుపతిరెడ్డి, గానాది కిషన్, ఇట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కందుకూరి బాలరామ్, మాధవరెడ్డి, వాసాల వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల బదిలీ

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు కానిస్టేబుళ్లను ఎస్పీ అఖిల్ మహాజన్ బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బి.కార్తీక్ వీర్నపల్లి, ఎండీ ఖరీమ్ హుస్సేన్ గంభీరావుపేట, బి.శ్రీనివాస్ కోనరావుపేట పోలీస్ స్టేషన్లకు బదిలీ అయ్యారు.

లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



రుద్రంగి: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రుద్రంగి ఎస్సై అశోక్ కోరారు. డ్రైవింగ్ వచ్చి డ్రైవింగ్ లైసెన్సు లేని 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఈనెల 26న సాయంత్రం 5 గంటల్లోపు ఎస్ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డు, రెసిడెన్సీ ప్రూఫ్ జిరాక్స్‌తో రుద్రంగి పోలీస్ స్టేషన్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. నిర్దేశిత ఆన్‌లైన్ రుసుముతో డ్రైవింగ్ లైసెన్సు ఇవ్వడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సురెన్సు లేకపోతే బాధితులకు అందాల్సిన ఇన్సురెన్సు క్లెయిమ్ అందదని, అందుకని ప్రతిఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సురెన్సు కలిగి ఉండి నిబంధనలతో కూడిన సురక్షిత డ్రైవింగ్ చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



బండి సంజయ్‌కి వినతి పత్రం ఇస్తున్న మల్లేశం

ఎల్లారెడ్డిపేట: బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, శ్రమదోపిడీకి గురవుతున్నారని కార్మికశక్తి బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరబత్తిని మల్లేశం కోరారు. ఈమేరకు ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. మల్లేశం మాట్లాడుతూ 50 ఏళ్లు పైబడిన వారికి పింఛన్, తొమ్మిదేళ్ల సర్వీస్ ఉంటే ఒక సంవత్సరం కలిపి పదేళ్లకు ఇచ్చే సౌకర్యాలను 2009 నుంచి రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు.

వైకుంఠ రథానికి మరమ్మతులు చేపట్టాలి

గంభీరావుపేట: మండల ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైకుంఠ రథం చెడిపోయి రెండు నెలలు గడుస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని మండల వార్డు సభ్యుల ఫోరం కన్వీనర్ బండ రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకుంఠ రథం పని చేయకపోవడంతో వైకుంఠ ధామానికి మృతదేహాల తరలింపునకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు.

‘సాగు’భారం..

- పెరిగిన పెట్టుబడులు
- గతేడాది కంటే 25 శాతం పెరిగిన పరికరాల ధరలు
- వ్యవసాయ యంత్రాల అద్దె రెట్టింపు
- తడిసిమోపడవుతున్న ఖర్చులు
- ఇబ్బందుల్లో అన్నదాతలు



అద్దె పనిముట్ల ట్రాక్టర్



పదిరలో కేజీవీల్‌తో దుక్కి దున్నతున్న ట్రాక్టర్

ఎల్లారెడ్డిపేట: యాసంగి సాగు చేయడం అన్నదాతలకు తలకు మించిన భారంగా తయారైంది. భారీగా పెరిగిన పెట్టుబడులతో ప్రధానంగా సన్న, చిన్నకారు, మధ్యతరగతి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గతేడాదితో పోలిస్తే వ్యవసాయ పెట్టుబడులు రెట్టింపయ్యాయి. మరోపక్క వ్యవసాయ పరికరాల ధరలు గతంతో పోల్చుకుంటే 25 నుంచి 30 శాతం వరకు పెరగడంతో.. కర్షకులకు సాగు చేయడం తలకు మించిన భారంగా తయారైంది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని ప్రాంతాలవారీగా పెరిగిన పనిముట్ల ధరలతో రైతులు కుదేలవుతున్నారు. పెరిగిన ధరలతో వ్యవసాయం చేయలేకపోతున్నామని ఎల్లారెడ్డిపేట మండల రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం పెట్టుబడులు, పెరిగిన యంత్రాల అద్దెలతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. మరో దారి లేక పెంచిన ధరలను అనుసరిస్తూ.. భారమైనా సాగును ముందుకు తీసుకుపోతున్నారు.

25 శాతం పెరిగిన పెట్టుబడులు

ఎల్లారెడ్డిపేట మండలవ్యాప్తంగా ఈవిధంగా ధరలు పెరిగాయి. నారుమడి, పొలం దున్నడానికి గతంలో రూ.5,500 ఉండగా, ప్రస్తుతం ఆ ధర 7,200కు పెరిగింది. వరి వేయడానికి రూ.వెయ్యి ఉండగా.. ప్రస్తుతం రూ.1,500 అయింది. నాటు వేయడం ఒక ఎకరానికి రూ.4,500 ఉండగా.. రూ.5,500 వరకు పెరిగింది. రూ.15వేలున్న కేజీవీల్స్‌కు రూ.18వేలు కాగా.. కల్టీవేటర్‌కు రూ.25వేలుండగా.. ప్రస్తుతం రూ.30వేలయింది. హైబ్రిడ్ వరి విత్తనాలు 20 కిలోలకు రూ.2వేలు పెరిగింది. కలుపు మందు, కలుపు తీయడం కోసం రూ.2,300, డీఏపీ, జింక్, గుళికలు, యూరియా మందుల పిచికారీకి రూ.25వేలు, ప్రస్తుతం వ్యవసాయం ఎక్కువ మంది రైతులు ట్రాక్టర్ ఆధారిత పరికరాలతో చేస్తున్నారు. వీటికి విడి సామగ్రి, విడి బోల్టులు, పాయింట్లు, పిన్నులు, కడ్రలు, నాగళ్ల ధరలతో పాటు టిల్లర్, పవర్ టిల్లర్ విత్తన గొర్రు, గుంటుక, రొటివేటర్, చదును చేసే పరికరాలు, కలుపు తీసే యంత్రాల ధరలు భారీగా పెరిగాయి. నాగలి సెట్టుకు వేసే పాయింట్లు గతేడాది రూ.500 ఉండగా.. ప్రస్తుతం రూ.వెయ్యి, గొర్రు సెట్టుకు రూ.23వేలుండగా.. ప్రస్తుతం రూ.36వేలు, రూ.500 ఉండే నాగలి కడ్రలు రూ.వెయ్యి, రూ.42వేలుండే సీడ్ డ్రిల్ రూ.48వేలు, రూ.85వేలుండే పవర్ వీడర్ రూ.98వేలు, రూ.1.6లక్షలుండే రోటివేటర్ రూ.1.20లక్షల చొప్పున పెరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలననుసరించి ఇక్కడ ధరలు పెరిగాయి.

డీజిల్ ధరల పెంపుతో భారం

ఇనుము ధరలు పెరగడం, కూలీల కొరత, డీజిల్ ధరల పెంపుతో రవాణా చార్జీలు అధికం కావడం మూలంగా వ్యవసాయ సామగ్రి ధరలు పెరిగాయి. ఇనుము ధర గతేడాదితో పోలిస్తే టన్నుకు రూ.20వేల వరకు పెరిగింది. ఫలితంగా ఆ భారమంతా అన్నదాతలపైనే పడుతోంది. ప్రైవేట న్నింటి ధరలకు రెక్కలు రావడంతో వాటికి సంబంధించిన వ్యవసాయ ఆధారిత పరికరాల ధరలు ఆకాశాన్నంటాయి. మొత్తంగా దేశానికి అన్నం పెట్టే రైతన్నలు వ్యవసాయం చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా చిన్న, సన్నకారు వర్గాల రైతులకు యాసంగి సాగు చేయడం ఇబ్బందిగానే మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు ప్రభుత్వపరంగానే పనిముట్లను అందించి అన్నదాతలను ఆదుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

భారమైతంది



యాసంగిలో విత్తనాల నుంచి మొదలుకొని పంటలు సాగు చేసే వరకు అన్ని ఖర్చులు తడిసి మోపడవుతున్నయ్. ట్రాక్టర్ ఖర్చులు, పరికరాల భారంతో అప్పులు చేయాల్సొత్తంది. పరికరాలపై ధరలు తగ్గించి రైతాంగాన్ని ఆదుకోవాలి. ప్రభుత్వమే అద్దె పనిముట్లను తక్కువ ధరకు అందించాలి.

- మట్ట సత్తిరెడ్డి, రైతు, అల్మాస్‌పూర్

పెరిగిన ధరలు



వ్యవసాయ పరికరాల తయారీలో వాడే ఇనుము తదితర వస్తువులకు ధరలు బాగా పెరిగాయి. పరికరాల తయారీలో భాగంగా కటింగ్, వెల్డింగ్ చేసే సమయంలో ఆక్సిజన్‌తో పాటు గ్యాస్ వాడాలి. దీంతో సాగుకు వినియోగించే యంత్రాలకు ధరలు పెంచక తప్పలేదు. గతంతో పోల్చుకుంటే 25 శాతం వరకు అన్ని పరికరాలపై ధరలు పెరిగాయి. **- రావుల గవాస్కర్, తయారీదారు, ఎల్లారెడ్డిపేట**

ధరలు పెరిగింది వాస్తవమే..



వ్యవసాయ రంగంలో వాడే పనిముట్ల ధరలు పెరిగింది వాస్తవమే. మార్కెట్లో పరికరాల తయారీ కోసం వినియోగించే ముడిసరుకుల ధరలు పెరగడం మూలంగానే ఈ పరిస్థితి తలెత్తింది. రైతులు సేంద్రియ ఎరువులు వాడి కొంత ఖర్చులను తగ్గించుకోవాలి. ప్రభుత్వం సబ్సిడీపై కొన్ని పరికరాలను అందిస్తోంది.

- చాద భూంరెడ్డి, వ్యవసాయ అధికారి, ఎల్లారెడ్డిపేట

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు



ప్రతాపరామకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

గంభీరావుపేట: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికైన ప్రతాపరామకృష్ణను మండల నాయకులు శుక్రవారం కలిశారు. ఆయనను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణకాంత్‌యాదవ్, కుషిగుంపుల రవిగౌడ్, ఎర్ర భాస్కర్, సర్వోత్తం తదితరులున్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

వేములవాడఅర్బన్: రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా మరోసారి నియమితులైన ప్రతాపరామకృష్ణను ఆ పార్టీ నాయకులు శుక్రవారం సన్మానించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణాధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, అన్నారం శ్రీనివాస్, గడ్డమీది శ్రీనివాస్, రాపెల్లి శ్రీధర్, సగ్గు రాహుల్ ఉన్నారు.

ఎస్‌ఎంసీలకు ఎన్నికలు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, తెలంగాణ మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో పాఠశాలల యాజమాన్య కమిటీల ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రమేశ్ తెలిపారు. ఈనెల 20 నుంచి 29 వరకు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకోవాలన్నారు.

24న రాజన్న హుండీ లెక్కింపు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయం హుండీ ఈనెల 24న ఉదయం 8 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



వెంకటాపూర్‌లో విద్యార్థుల చిత్రలేఖనం ప్రదర్శన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వెంకటాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై యాంటీ డ్రగ్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని రాణించగా.. వారికి త్వరలోనే బహుమతులను ప్రదానం చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు మాణిక్యం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ముస్తాబాద్: డ్రగ్స్ మత్తు పదార్థాల వినియోగం ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు పోలీస్ శాఖ ముస్తాబాద్, బందనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం వ్యాసరచన పోటీలను నిర్వహించింది. సమాజంలో డ్రగ్స్ వినియోగించి ఎంతటి ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారో వివరించామని ఎస్సై శేఖర్ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

కోనరావుపేట: డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై డి.ఆంజనేయులు సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రగ్స్‌పై అవగాహన కోసం అన్ని గ్రామాల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఏఎస్సైలు శ్రీనివాస్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న గ్రామస్తులు

గంభీరావుపేట(సిరిసిల్ల): కొత్తపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయమైంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, డబుల్ రోడ్డుగా మార్చాలని గ్రామస్తులు కొంతకాలంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా.. పనులు ప్రారంభం కాలేదు. రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. దీంతో గ్రామస్తులు, పలువురు నాయకులు ఏకమై శ్రమదానం చేసి గుంతల్లో మొరం పోశారు. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ నిర్లక్ష్యం కారణంగా రోడ్డు పరిస్థితి ఇలా మారిందని నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా హడావిడిగా నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించి.. పనులు ప్రారంభింపజేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. శివసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కోర్ కమిటీ సభ్యుడు గౌటే గణేశ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పెద్దూరి పర్శాగౌడ్, మల్లేశం, రాజాగౌడ్, శంకర్, మహేందర్‌రెడ్డి, రాజేశ్, సంజీవ్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

రుద్రంగి: 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు, ఓటరు నమోదుకు అర్హులైనవారు, ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోనివారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని రుద్రంగి తహసీల్దార్ శ్రీలత కోరారు. శుక్రవారం రుద్రంగి తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు అవకాశం

వేములవాడఅర్బన్: నియోజకవర్గంలోని 260 పోలింగ్ బూత్‌లలో బూత్‌స్థాయి అధికారులు ఈనెల 20, 21న స్పెషల్ క్యాంపెన్ నిర్వహించనున్నట్లు వేములవాడ తహసీల్దార్ మహేశ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. కొత్తగా ఓటు నమోదు, సవరణలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మహతి జాబ్‌మేళాకు స్పందన



బ్యాంక్ కొలువులకు ఎంపికైన అభ్యర్థులు

సిరిసిల్లకల్చరల్: కార్పొరేట్ బ్యాంకుల్లో కొలువుల భర్తీ కోసం ప్రదీప్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మహతి మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200కు పైగా అభ్యర్థులు మేళాకు హాజరయ్యారు. యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, యునిటీ స్మాల్ సేవింగ్స్ బ్యాంక్, ఎస్ బ్యాంక్‌ల్లోని ఖాళీలను భర్తీ చేశారు. మూడు దశల్లో స్క్రీనింగ్ అనంతరం 69 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. యాక్సిస్ బ్యాంక్‌కు 10, ఐసీఐసీఐ 14, యునిటీ బ్యాంక్ 10, ఎస్ బ్యాంక్‌కు 35 మందిని ప్రొవిజనల్‌గా ఎంపిక చేశారు. ఈనెల 22 తర్వాత శిక్షణ ఇవ్వనున్నట్లు యాక్సిస్ బ్యాంక్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ వినయ్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను మహతి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.రాజు, ప్రదీప్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రిన్సిపాల్ గెంట్యాల భూమేశ్, ఆయా బ్యాంకుల ప్రతినిధులు ప్రణయ్, శివ, అధ్యాపకులు, వేణుగోపాల్, టి.రాజేందర్, డి.లక్ష్మి, డి.స్వామి, ఎస్.శరత్ అభినందించారు.

బాకూర్‌పల్లితండాలో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

ఎల్లారెడ్డిపేట: బాకూర్‌పల్లితండాలో శుక్రవారం అశ్విని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలు వ్యాధులతో బాధపడుతున్న 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి అవసరమున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీరా మంజుల, ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.అభినయ్, వైద్య సిబ్బంది, తండావాసులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఒకరిపై కేసు

బోయినపల్లి: విలాసాగర్ గ్రామానికి చెందిన మేకల నర్సయ్యను ఇదే గ్రామానికి చెందిన మేకల మహేశ్ పాత గొడవలు దృష్టిలో పెట్టుకొని పారతో తలపై కొట్టినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. పొలం వద్ద ఉన్న తనను మహేశ్ పారతో కొట్టాడని ఫిర్యాదు ఇచ్చినట్లు వివరించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

తంగళ్లపల్లి: గండిలచ్చపేట గ్రామంలో మాజీ జెడ్పీటీసీ కోడి అంతయ్య ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య, ఉప సర్పంచ్ రవి, బల్లెపు సిద్ధన్న, ఆత్మకూరి చంటి యాదవ్, సాయిరావు, దేవుని రమేశ్, శంకర్, జలంధర్, శ్రీశైలం, కిషన్, శ్రీనివాస్, ప్రశాంత్, బాలయ్య, మోహన్, అజయ్, భిక్షపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

ముస్తాబాద్: ముస్తాబాద్, మద్దికుంట గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశాలను శుక్రవారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అధికారులు వివరించారు. సర్పంచ్ సుమతి, ఎంపీడీవో రమాదేవి, వైద్యాధికారి గీతాంజలి, వివిధ శాఖల అధికారులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

బోయినపల్లి: విద్యార్థులకు చక్కని విద్యాబోధన చేయడంలో ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ పేర్కొన్నారు. బదిలీ అయిన బోయినపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎం.ప్రేమలత, ఉపాధ్యాయుడు గసికంటి శ్రీనివాస్‌కు శుక్రవారం హైస్కూల్ ఆవరణలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యాబోధనలో వారు చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బొలగం శ్రీనివాస్, జలేందర్, అల్తాఫ్ అహ్మద్, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనలో టీపీటీఎఫ్ ముందుంటుంది

తంగళ్లపల్లి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ఉపాధ్యాయుల హక్కుల సాధనలో ఎప్పుడూ ముందుంటుందని జిల్లా ఉపాధ్యక్షుడు పురం వాసుదేవరావు అన్నారు. శుక్రవారం పద్మనగర్ కేజీబీవీలో టీపీటీఎఫ్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. మండల అధ్యక్షుడు బండి ఉపేందర్ మాట్లాడుతూ.. కేజీబీవీ ఉపాధ్యాయినుల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. శ్యామల, రజిత, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల చావులు బీఆర్‌ఎస్ హత్యలే..

సిరిసిల్లటౌన్: భార్యల పుస్తెలమ్మి అభివృద్ధి పనులు చేపట్టిన సర్పంచులకు బిల్లులివ్వకపోవడంతో ఆత్మహత్యలకు పాల్పడ్డారని, వారివి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హత్యలుగా కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం సిరిసిల్లలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు.

కాంగ్రెస్‌లో చేరిక

సిరిసిల్లటౌన్: బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు, శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. శివనగర్‌లోని సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా దేవయ్య

ముస్తాబాద్: తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి మాజీ సర్పంచ్ గాడిచెర్ల దేవయ్యను నియమిస్తూ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పిట్టల రవీందర్ నియామకపత్రం శుక్రవారం అందజేశారు. ముదిరాజ్ మత్స్యకారుల హక్కుల కోసం పనిచేస్తామని ఈసందర్భంగా గాడిచెర్ల దేవయ్య అన్నారు. చెరువులు, నీటి ప్రాజెక్టుల్లో మత్స్యకారులైన ముదిరాజ్‌లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ పథకాల్లో మత్స్యకారులకు ప్రాధాన్యత కల్పించేందుకు, చేతినిండా ఉపాధి చూపేలా కోరడం జరుగుతుందన్నారు. కొద్దిరోజుల్లోనే మండల కమిటీలను నియమించనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక



కోనరావుపేట: కాంగ్రెస్ వెంకట్రావుపేట గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జొర్రిగ వెంకటేశం ఎన్నికయినట్లు మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా తెలిపారు. ఉపాధ్యక్షులుగా మంతెన నరేశ్, మానుక మహేశ్, ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి తిరుపతి, కోశాధికారిగా పారిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా మ్యాకల భూమయ్య, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ మాధవరెడ్డి, మల్లేశం, రవి, లచ్చయ్య, ముత్తయ్య, లచ్చిరెడ్డి, మల్లయ్య, పోచయ్య, భూమయ్య, రాములు, భాస్కర్‌రెడ్డి, పల్లం లింగయ్య తదితరులు ఎన్నికయ్యారు.

బీజేపీవి ప్రజావ్యతిరేక విధానాలు

సిరిసిల్లటౌన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కారు ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన తరుణం ఆసన్నమైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని సీఐటీయూ కార్యాలయంలో కార్మిక, కర్షక, ఐక్యత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, రామంచ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాముడి అక్షింతలు పంపిణీ



గంభీరావుపేట: అక్షింతలు అందజేస్తున్న నాయకులు

గంభీరావుపేట: మండల కేంద్రంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానం నుంచి అయోధ్య రామమందిర అక్షింతలతో శుక్రవారం మేరు, ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటా అక్షింతలను పంపిణీ చేశారు.

ఇంటింటా..

చందుర్తి: కిష్టంపేట గ్రామంలో అయోధ్య రాముని పూజిత అక్షింతలు సర్పంచ్ అంబిరి కల్పన, ఉప సర్పంచ్ ఉగిలే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటా అందజేశారు. ముందుగా శ్రీహనుమాన్ దేవాలయంలో పూజ నిర్వహించారు. మాజీ సర్పంచులు బానాల గంగారెడ్డి, కొమ్ము రమేశ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా: 9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899